# విద్యార్థుల ప్రాణాలతో 'రాజీ'..

**● జవహర్ పాఠశాల బస్సు ప్రమాదంలో విస్తుపోయే నిజాలు**
**● మద్యం మత్తులో డ్రైవర్ వీరంగం.. బస్సు అద్దాలు ధ్వంసం**
**● ప్రాణభయంతో కేకలు వేసిన పసిపిల్లలు..**
**● కేసు పెట్టకుండా 'దారి' కోసం దౌర్జన్యాన్ని వదిలేసిన ప్రిన్సిపాల్?**
**● బ్రీత్ అనలైజర్ లేదు, కేసు లేదు, చట్టాన్ని అపహాస్యం చేస్తున్న విద్యాసంస్థ తీరు**
**● జిల్లా కలెక్టర్,ఎస్పీ పసిపిల్లల ప్రాణాల కంటే ఈ సెటిల్మెంట్లు ముఖ్యమా?**
**- విద్యా శాఖ అధికారులు వెంటనే స్పందించాలి**
**- పోలీసులు సుమోటోగా చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.**

నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలంలో గురువారం ఉదయం జరిగిన స్కూల్ బస్సు ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అశ్వారావుపేటకు చెందిన జవహర్ విద్యా సంస్థకు చెందిన స్కూల్ బస్సును వినాయకపురం – మామిళ్ళవారి గూడెం మధ్యలో ఒక ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. అయితే, ఈ ఘటనలో విద్యార్థుల ప్రాణాలు తృటిలో తప్పినప్పటికీ, పాఠశాల యాజమాన్యం అనుసరిస్తున్న తీరు ఇప్పుడు అనేక అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది.

ఘటనా స్థలంలో భయానక దృశ్యాలు

ప్రమాదం జరిగిన తీరును గమనిస్తే, ట్రాక్టర్ వేగం మరియు డ్రైవర్ అపస్మారక స్థితి స్పష్టంగా కనిపిస్తున్నాయి. బస్సు అద్దాలు పగిలి లోపల పడటంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై కేకలు వేశారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ప్రమాదం తర్వాత కూడా హల్చల్ చేస్తూ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

న్యాయం కంటే 'రాజీ'కే మొగ్గు?:

ఈ ఘోర ప్రమాదంపై పాఠశాల ప్రిన్సిపాల్ స్పందించిన తీరు విస్మయానికి గురి చేస్తోంది. స్వయంగా విద్యార్థుల ప్రాణాలు ప్రమాదంలో పడినా, మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన బాధ్యతను ఆయన విస్మరించారు. "పొద్దున లేస్తే మా బస్సు అదే రూట్‌లో వెళ్లాలి కాబట్టి సరిపెట్టుకున్నాం" అని ఆయన స్వయంగా పేర్కొనడం గమనార్హం. ఈ ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన జవహర్ పాఠశాల ప్రిన్సిపాల్, విట్టూరంగా రాజీ మంత్రం పట్టించడం పట్ల సర్వత్ర ఆగ్రహం వ్యక్తం అవుతుంది. సాధారణంగా విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన విద్యాసంస్థ ఒక తాగుబోతు డ్రైవర్ చేసిన ప్రమాదాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మేము రాజీ పడ్డాము పేరెంట్స్ ను కూడా ఒప్పించాము అని ప్రిన్సిపాల్ చెబుతున్న సమాధానం వింటే అక్కడ విద్య కంటే సెటిల్మెంట్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. పసిపిల్లల ప్రాణాలు తృటిలో తప్పినప్పుడు రేపు అదే డ్రైవర్ మరో ప్రమాదం చేసి ప్రాణాలు తీయడని గ్యారంటీ ఏమిటి? అంటే, విద్యార్థుల భద్రత కంటే తమ వ్యాపార ప్రయోజనాలు మరియు దారి సమస్యలే ముఖ్యమని యాజమాన్యం భావిస్తోందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో సాక్ష్యాల మాయం తేటతెల్లమవుతుంది. డ్రైవర్ మద్యం తాగాడు లేదు తేల్చడానికి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయించకుండా పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అతడిని వదిలేయడం ద్వారా యాజమాన్యం పెద్ద నేరానికే పాల్పడింది. అజ్ఞానమా? అహంకారమా?బస్సు వెళ్లే దారిలో నిత్యం ఎదురయ్యే వ్యక్తులు కాబట్టి రాజీ పడ్డామని చెప్పడం చట్టంపై ఉన్న చులకన భావాన్ని సూచిస్తుంది. భయాందోళనలో ఉన్న తల్లిదండ్రులకు భద్రతపై హామీ ఇవ్వాల్సింది పోయి కేసు పెట్టకుండా ఒత్తిడి తెచ్చారా? అన్న అనుమానం కలుగుతుంది.

నియమ నిబంధనలు ఏం చెబుతున్నాయి?

పాఠశాల వాహనాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం, విద్యార్థుల భద్రతకు పాఠశాల యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలి.

మోటార్ వాహనాల చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడపడం తీవ్రమైన నేరం. ఇలాంటి వ్యక్తులను వదిలివేయడం వల్ల భవిష్యత్తులో మరింత మంది ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

సుమోటో కేసు: ఒక నేరం జరిగినప్పుడు బాధితులు ఫిర్యాదు చేయకపోయినా, ప్రజా భద్రత దృష్ట్యా పోలీసులు సొంతంగా (సుమోటో) కేసు నమోదు చేసే అధికారం ఉంది.














పసిపిల్లల ప్రాణాలతో చెలగాటమాడిన మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌పై, అలాగే ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకున్న లేదా దాచిపెట్టిన పాఠశాల యాజమాన్యంపై జిల్లా విద్యాశాఖ అధికారులు మరియు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. జవహర్ స్కూల్ ప్రిన్సిపల్ వివరణ: నేను స్పాట్లో లేను కాబట్టి అతను తాగాడు లేదు నాకు తెలియదు అంటూనే మరోవైపు సరిపెట్టుకున్నాం అని చెప్పడం విడ్డూరం. మరి బస్సు అద్దాలు పగిలి పిల్లలు గాయపడే పరిస్థితి వస్తే అప్పుడు కూడా ఇదే సమాధానం చెప్పేవారా?


విద్యా శాఖ: విద్యార్థుల భద్రతలు గాలి కుదిలేసిన జవహర్ స్కూల్ గుర్తింపు పై పునరాలోచించాలి. పసి పిల్లల ప్రాణాలకు వెలకట్టె అధికారం ఎవరికి లేదు. విద్యాశాఖ అధికారులు స్పందించాల్సిందేనని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అశ్వారావుపేట పోలీసులు వెంటనే స్పందించి




ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేయాలని పౌర సమాజం కోరుతోంది.

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన గుబ్బల లక్ష్మినారాయణ

కుత్బుల్లాపూర్, నవతరం: ఇండస్ట్రియల్ ఏరియా సుభాష్ నగర్ డివిజన్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా పీసీబీ అధికారులు ముందస్తుగా చర్యలు చేపడితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని అధికారులను హెచ్చరించారు డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ. సుభాష్ నగర్ డివిజన్ ఎస్వీ కోపరేటివ్ సొసైటీ ఇండస్ట్రేయిల్ ఏరియాలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, గుబ్బల లక్ష్మి నారాయణ, ఇస్మాయిల్. అనంతరం వారు మాట్లాడుతూ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పిసిబి అధికారులు సరిగా వ్యవహరించక తనిఖీలు చేయక అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు ప్రత్యక్షమవుతున్నారని అగ్ని ప్రమాదాలు జరగకుండా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఇప్పటికైనా ఒళు ళ్ళ దగ్గర పెట్టుకుని అధికారులు వ్యవహరించాలని డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ ఆగ్రహం





వ్యక్తం చేశారు.





## ఘనంగా ఎన్ఎస్యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు









హైదరాబాద్, నవతరం: మేడ్చల్-మల్కాగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ఐడిపిఎల్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర నాయకులు గొల్ల జాన్, పృధ్వీ రాజ్ అధ్వర్యంలో ఎన్ఎస్యుఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు కున రాఘవేంద్ర గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషోర్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సాధు యాదవ్, వెంకటేష్ బిల్లా, తెలంగాణ రాష్ట్ర నాయకులు రితేష్ రావు, కుందన్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఎన్ఎస్యుఐ జెండాను ఆవిష్కరించి, కేక్ కటింగ్ చేశారు. అనంతరం గొల్ల జాన్ మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఎంతోమంది తొలి తరం నాయకులకు ఎన్ఎస్యుఐ ఒక శక్తివంతమైన వేదికను కల్పించిందన్నారు. ఇక్కడ తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారిలో అనేకులు నేడు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా మరియు ముఖ్యమంత్రులుగా కూడా దేశానికి సేవలందిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, ఎన్ఎస్యుఐ లక్షలాది మంది విద్యార్థులకు వారి విద్యాపరమైన ప్రస్థానంలో సహాయపడింది; వారిలో అనేకులు ఇప్పుడు దేశ నిర్మాణంలో తమ వంతు కృషి చేస్తున్నారని, విద్యార్థుల సమస్యలను లేవనెత్తడంలోనూ, మన దేశ సామాజిక ఐక్యతను పరిరక్షించడంలోనూ ఎన్ఎస్యుఐ ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయి కిరణ్, విజయ్ రెడ్డి, సాద్విక్, హరి రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

